సాక్షి జగిత్యాల

సోమవారం, 7, అక్టోబర్, 2024

సూర్యప్రభ వాహనంపై నృసింహుడు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వాములు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.1,69,115 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.



న్యూస్‌రీల్

ముంబయిలో సిద్ధి వినాయకుడిని దర్శించుకున్న విప్ అడ్లూరి



ముంబయిలో సిద్ధి వినాయకుడి సన్నిధిలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్

ధర్మపురి: ముంబయి నగరంలో కొలువుదీరిన శ్రీసిద్ధి వినాయకుడిని ఆదివారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం ముంబయిలోని తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు బోర్వేలిలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టెంపుల్ ట్రస్ట్ సభ్యులు, తెలుగు అసోసియేషన్ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పుప్పాల శ్రీకాంత్

జగిత్యాలటౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, అక్రమ తొలగింపులు ఆపాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నిర్వహించే చలో కలెక్టరేట్ మహాధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. మహాధర్నాలో పెద్ద సంఖ్యలో జీపీ కార్మికులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అధికారంలోకొచ్చి 10నెలలు గడుస్తున్నా.. కార్మికుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పులి మల్లేశం, వెంకటాచారి, రాజేశం, శాతల్ల రాజేందర్, గర్వందుల రమేశ్ తదితరులు ఉన్నారు.

'ఉపాధి హామీ'పై సోషల్ ఆడిట్ సభలు



గ్రామసభలో పాల్గొన్న డీఆర్పీ గంగారాం

మల్లాపూర్ : ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీఆర్పీ గంగారాం తెలిపారు. మండలంలోని వేంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సామాజిక తనిఖీ గ్రామసభలో మాట్లాడారు. మండలవ్యాప్తంగా 23 గ్రామపంచాయతీల్లో ఆడిట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేంపల్లి, హుస్సేన్‌నగర్, సంగెం శ్రీరాంపూర్, వెంకట్రావ్‌పేట, కుస్తాపూర్, దాంరాజ్‌పల్లి, రేగుంట, మల్లాపూర్ గ్రామాల్లో తనిఖీ గ్రామసభలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమాలలో ఎంపీడీవో జగదీష్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఏపీవో సతీశ్, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థి ఆరోగ్యం భద్రం

- మానసిక, శారీరక లోపాలపై దృష్టి
- ఆరోగ్య ప్రశస్త్ పేరిట ప్రత్యేక యాప్
- చిన్నారుల వివరాలన్నీ నమోదు
- ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ



ప్రశస్త్ యాప్



ఆన్‌లైన్‌లో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

జగిత్యాల: పాఠశాలలకు వస్తున్న విద్యార్థుల్లో మానసిక, శారీరకలోపాలతోపాటు, అభ్యాసన లోపాలు ఉంటాయి. వీటిని చాలామంది గమనించలేరు. ఫలితంగా విద్యార్థులు చదువులో వెనుకబడతారు. ఇలాంటి లోపాలను గుర్తించి వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఆరోగ్య ప్రశస్త్ యాప్‌ను విద్యాశాఖ ప్రత్యేకంగా రూపొందించింది. ఈ యాప్‌పై ప్రతి ఉపాధ్యాయునికీ శిక్షణ కల్పించారు. పిల్లలను నేరుగా పరిశీలించి వారి లోపాలను గుర్తించనున్నారు. అనంతరం వారికి మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోనున్నారు.

ప్రశస్త్ యాప్‌లో నమోదు

పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు, ఉపాధ్యాయులు వారి మొబైల్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఉపాధ్యాయుని పేరు.. పనిచేస్తున్న పాఠశాల, మొబైల్ నంబరు, ఐడీ తదితర వాటిని రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత విద్యార్థుల పేర్లు నమోదు చేస్తారు. ప్రభుత్వం ఈ యాప్‌లో మొత్తం 63 సామర్థ్య ప్రశ్నలు ఉంచారు. ఉదాహరణకు.. విద్యార్థి మెట్లు ఎక్కగలడా..? దృష్టి లోపం ఏమైనా ఉందా..? సరిగా వింటున్నాడా..? వంటి ప్రశ్నలు ఉన్నాయి. వీటిని పరిశీలించి యాప్‌లో ఎస్/నో అనే ఆప్షన్ వస్తాయి. వెంటనే గుర్తించి చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటారు. ఈ 63 ప్రశ్నల్లో అన్ని సరిగా ఉన్నాయా..? లోపాలు ఉన్నాయా..? అని గుర్తించనున్నారు. శారీరక, మానసిక సమస్యలతోపాటు, విద్యార్థి సరిగా చదువుతున్నాడా..? అక్షరాలు గుర్తుపడుతున్నాడా..? నత్తి మాట్లాడుతున్నాడా..? ఇలా ప్రతీది ఇందులో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రతి ఉపాధ్యాయునికి శిక్షణ కల్పించారు. అక్టోబర్ 20 నుంచి నవంబర్ 14 వరకు దీనిని కొనసాగించనున్నారు. లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వైద్యులకు నివేదించిన అనంతరం చికిత్స అందిస్తారు.

మెరుగైన వైద్యం

విద్యార్థులకు శారీరక, మానసిక సమస్యలుంటే వారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారు. మొదట స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు వీరిని గుర్తించి వీరికి ఏమేం కావాలో గుర్తించి వారికి చికిత్స అందిస్తుంటారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఎక్కువగా పేదవారు కావడంతో ప్రభుత్వమే గుర్తించి వారికి అందించేలా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థికి ఏదైనా లోపం ఉంటే వారి తల్లిదండ్రులకు చెప్పి వారి సమక్షంలోనే విద్యార్థికి చికిత్స అందించనున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రతి మండలంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు జిల్లావ్యాప్తంగా 28 మంది ఉన్నారు. వారందరికీ శిక్షణ ఇచ్చారు. వీరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కార్యక్రమం తీరుపై వివరిస్తారు.

పేద విద్యార్థులకు మేలు

కొంతమంది విద్యార్థులకు లోపాలు ఉన్నా.. బయటకు తెలియదు. పేద తల్లిదండ్రులు సైతం వాటిని గుర్తించక యథావిధిగా స్కూల్‌కు పంపిస్తుంటారు. కొద్దిరోజుల అనంతరం బయటకు తెలిసిన తర్వాత అప్పటికే చికిత్స అందక పరిస్థితి చేజారిపోతుంది. ముఖ్యంగా నత్తి మాట్లాడటంగానీ, నడకలో లోపాలు, దృష్టి లోపం వంటి సమస్యలు విద్యార్థుల్లో కన్పిస్తుంటాయి. వీటికి మొదట్లోనే చికిత్స అందిస్తే తొందరగా నయమయ్యే అవకాశం ఉంటుంది. ఆరోగ్య ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు కలగనుంది.

విద్యార్థుల వివరాలు నమోదు




ప్రశస్త్ యాప్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్నాం. ఇప్పటికే ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇచ్చాం. విద్యార్థుల్లోని లోపాలను గుర్తించి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు పరిశీలించి విద్యార్థులకు చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటాం.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

యాజమాన్యం	స్కూళ్లు	బాలురు	బాలికలు	మొత్తం
పాఠశాలలు	13	200	274	474
జిల్లాపరిషత్	175	2420	2019	4439
మోడల్‌స్కూళ్లు	13	555	627	1182
కేజీబీవీ	14	0	481	481
బీసీ వెల్ఫేర్	6	172	203	375
మైనార్టీ స్కూళ్లు	5	104	114	218
రెసిడెన్షియల్స్	2	62	74	136
సోషల్ వెల్ఫేర్	5	179	151	330
ప్రైవేటు స్కూళ్లు	104	2361	1995	4356
మొత్తం	337	6053	5938	11,991

శాకంబరి రూపంలో అమ్మవారి దర్శనం





ధర్మపురిలో శాకంబరి రూపంలో అమ్మవారు, నవదుర్గా సేవాసమితి ఏర్పాటు చేసిన అమ్మవారు

ధర్మపురి: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం శాకంబరి3 రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపిస్తున్నారు. ఉత్సవాల్లో నాలుగోరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యూ టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గా సేవాసమితి ఏర్పాటు చేసిన దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కూష్మాండ రూపంలో దర్శనమిచ్చారు.



దుర్గామాతకు తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

రాయికల్‌లో కన్నుల పండువగా దుర్గామాత తెప్పోత్సవం

రాయికల్: రాయికల్‌లోని శ్రీనవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి ఆదివారం రాత్రి తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అర్చకులు వినీత్‌కుమారాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెరువులో తెప్పోత్సవం గావించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, భక్తులు పాల్గొన్నారు.



అర్ధనారీశ్వరుడి వేషధారణలో బాలుడు



న్యూజిలాండ్‌లో ఘనంగా బతుకమ్మ

జగిత్యాలరూరల్:బతుకమ్మ సంబురాలను న్యూజిలాండ్‌లోని దక్షిణ కాంటర్‌బరీ ప్రాంతంలో ప్రవాస భారతీయ మహిళలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున హాజరై గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గడికప్పుల శేఖర్, జమున, జలపెల్లి రంజిత్, ప్రవళిక పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- పోతారంలో పీఏసీఎస్ భవనం ప్రారంభం



రైతులతో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: రైతులను దళారుల దోపిడీ నుండి రక్షించి వారిని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ హయాంలోనే సహకార సంఘాలకు పునాది వేశామని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని పోతారం సింగిల్‌విండో నూతన భవనాన్ని ఆదివారం చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు, సంఘ సభ్యులతో కలిసి ప్రారంభించారు. విండో సభ్యులు ఐక్యతతో సంఘ భవనం నిర్మించుకోవడం అభినందనీయమని అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రైతులను పాడి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల వైపు ప్రోత్సహించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ ఏలేటి కిషన్ రెడ్డి, సీఈఓ గంగారాజం, సంఘ సభ్యులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

మల్లాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పుప్పాల లింబాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల రౌండ్‌టేబల్ సమావేశంలో మాట్లాడారు. బీసీ సంఘాలన్నీ ఐకమత్యంతో ఉద్యమించాలని, అప్పుడే రాజకీయంగా బలోపేతం అవుతామని పేర్కొన్నారు. బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీల ఐక్యతను చాటేందుకు ఈనెల 9న మెట్‌పల్లిలో సత్యాగ్రహ దీక్షకు పార్టీలకతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు మాజీ ఎంపీపీ కోరుట్ల రాములు, మాజీ సర్పంచ్ గజ్జి గంగారెడ్డి, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు సిరిపురం రవీందర్, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని హన్మాండ్లు, మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్, మున్నూరుకాపు సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీందర్



సారంగాపూర్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని అర్పపల్లికి చెందిన పడిగెల రవీందర్‌రెడ్డిని నియమించారు. ఫో రం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో స్వరాష్ట్ర సాధన కోసం రవీందర్ రెడ్డి బీఆర్ఎస్ నాయకుడిగా నిర్మాణాత్మక పాత్ర పోషించారని, తెలంగాణ సిద్ధించిన తరువాత పాలకులు ఉద్యమకారులు, కళాకారులను గుర్తించడంలో విఫలమయ్యారన్నారు.

'ప్రాథమిక' సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాలటౌన్: ప్రాథమిక విద్యాబోధనలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్ రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి విన్నవించారు. ప్రాథమిక విద్యాబోధనలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన ఫైవ్ ఎలిమెంట్స్ ఫర్ క్వాలిటీ అండ్ ఈక్వాలిటీ పేరుతో గొల్లపల్లి మండలానికి చెందిన ప్రాథమిక ఉపాధ్యాయుడు మడప శ్రీనివాస్ రూపొందించిన 70పేజీల డాక్యుమెంట్‌ను ఆదివారం హైదరాబాద్‌లో మురళికి అందించారు. ప్రాథమిక దశలో విద్యార్థి నేర్చుకోవాల్సిన సృజనాత్మకత, అవగాహన, అన్వయం, సమస్య పరిష్కారం వంటి నైపుణ్యాలు పెంపొందించేలా ప్రభుత్వానికి నివేదించి సత్ఫలితాల సాధనకు బాటలు వేయాలని కోరారు. జీవిత విలువలు, చిత్రలేఖనం, పాటలు, ఆటలు వంటి కార్యక్రమాలు అందేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజోజి భూమయ్య, జిల్లా బాధ్యులు పాలెపు శివరామకృష్ణ, సందుపట్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



శేషవాహనంపై స్వామివారు

కోరుట్ల: పట్టణంలోని అష్టలక్ష్మీ, శ్రీవేంకటేశ్వర ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అష్టలక్ష్మీ ఆలయంలో శ్రీవారు శేషవాహనంపై ఊరేగారు. శ్రీవేంకటేశ్వర ఆలయంలో వెంకన్న స్వామి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

పెరిగిన భూగర్భజలం

- 2.29 మీటర్ల లోతులోనే నీరు
- గత నెలతో పోల్చితే 0.39 మీటర్లు పైకి

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆగస్టు నెలతో పోల్చితే సెప్టెంబర్‌లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో భూగర్భజలాలు పైపైకి చేరాయి. ప్రస్తుతం జిల్లాలో సగటున 2.29 మీటర్ల లోతులోనే సాగు లభ్యమవుతోంది. 0.39 మీటర్ల మే భూగర్భజలం పెరిగి..వ్యవసాయబావుల్లో పైపైనే నీరు కనిపిస్తోంది.

ఎండపల్లిలో పడిపోయిన నీటి మట్టం

జిల్లాలో సగటున 2.29 మీటర్ల లోతులో భూగర్భ జలం ఉంటే.. ఎండపల్లి మండలంలో మాత్రం అత్యధికంగా భూగర్భజలం 7.96 మీటర్లకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. అత్యల్పంగా జగిత్యాలరూరల్ మండలంలో 0.80 మీటర్లకు పడిపోయింది. జిల్లాలోని మండలాల వారీగా పరిశీలిస్తే బీర్‌పూర్‌లో 0.92 మీటర్లు, బుగ్గారంలో 3.05, గొల్లపల్లిలో 2.60, పెగడపల్లిలో 1.80, సారంగాపూర్‌లో 2.72, వెల్గటూర్‌లో 2.07, ఇబ్రహీంపట్నంలో 2.53, మల్లాపూర్‌లో 2.05మీటర్లకు భూగర్భజలం పడిపోయింది.

మున్సిపాలిటీల్లో సాధారణ స్థాయిల్లోనే నీటిమట్టం

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో సాధారణ స్థాయిల్లోనే భూగర్భజలం కొనసాగుతోంది. జిల్లాకేంద్రంలో 3.30 మీటర్లు, రాయికల్‌లో 1.35, కోరుట్లలో 4.24, మెట్‌పల్లిలో 2.88, ధర్మపురిలో 2.85 మీటర్లలో నీటిమట్టం ఉంది. ఆయా మున్సిపాలిటీల్లో నీటి వాడకం ఎక్కువగా ఉన్నా.. భారీ వర్షాలతో పట్టణాలకు తాగునీరు సరఫరా చేసే రిజర్వాయర్లన్నీ నిండుకుండలా ఉండటంతో భూగర్భజలం పెద్దగా తగ్గినట్లు కనబడటం లేదు.



వ్యవసాయ బావుల ద్వారా పంటలకు అందిస్తున్న సాగు నీరు

భూగర్భజలాలు పైపైనే ఉన్నాయి



వ్యవసాయ బావుల్లో భూగర్భజలాలు పైపైనే ఉన్నాయి. యాసంగి పంటలకు కూడా బావుల్లో ఉన్న నీరు సరిపోతుంది. చాలా పంటలకు డ్రిప్ ద్వారా సాగు నీరు ఇస్తున్నాం. నీటి వృథా కూడా తక్కువగానే ఉంది. వరి పంటకే ఎక్కువ నీరు వినియోగం అవుతుంది.

– బందెల మల్లయ్య, చల్‌గల్, రైతు

నీటిని పొదుపుగా వాడుకోవాలి



రుతుపవనాలతో కురువాల్సిన వర్షం కురిసింది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు లేవు. జలాశయాలు నిండుకుండలా ఉన్నాయి కాబట్టి నీటిని పొదుపుగా వాడుకుంటూ.. మళ్లీ వర్షాకాలం వచ్చేవరకూ కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

– నర్సింహులు, జిల్లా భూగర్భజలాధికారి

నాన్‌ఆయకట్టు మండలాల్లో పడిపోతున్న నీటి మట్టం

జిల్లాలో నాన్ ఆయకట్టు మండలాల్లో నీటి మట్టం రోజురోజుకూ పడిపోతోంది. వర్షాలు తగ్గుముఖం పట్టడం.. సాగునీరు ఎక్కువగా వినియోగిస్తుండడంతో నీటిమట్టం తగ్గుతూ ఉంది. కొడిమ్యాల మండలంలో 5.18 మీటర్లు, మల్యాలలో 2.48, భీమారంలో 1.50, కథలాపూర్‌లో మీటర్, మేడిపల్లిలో 2.28మీటర్లలో లోతులో భూగర్భజలం ఉంది.

వరికి భారీగా ఉపయోగం

జిల్లాలో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయడంతో ఆ పంటకు నీటి వినియోగం ఎక్కువ. దీంతో వ్యవసాయ బావులు, చెరువులు, కుంటల ద్వారా భారీగా భూగర్భజలాలను వినియోగిస్తున్నారు. అక్టోబర్ నుంచి భూగర్భజలాలు మరింత లోతుకు పడిపోయే అవకాశం ఉంది. దీనికి తోడు నైరుతి రుతుపవనాలు వెనుతిరిగాయి. మళ్లీ వర్షాకాలం వచ్చేవరకు భారీ వర్షాలు కురిసే అవకాశం లేదు. ప్రస్తుతం ఉన్న నీటినే సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

క్లుప్తంగా

రెజ్లింగ్‌లో సత్తాచాటిన విద్యార్థి



పతకం అందుకుంటున్న లక్ష్మీప్రియ

వీణవంక(హుజూరాబాద్): పాఠశాలల క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో మండలంలోని ఘన్ముక్కుల గ్రామానికి చెందిన కాయిత లక్ష్మీప్రియ రజత పతకం సాధించింది. ఈ నెల 3–5 వరకు నారాయణపేట జిల్లా దన్వాడలో అండర్ –17 లోపు 53 కేజీల బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు జరిగాయి. సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ సాంఘీక సంక్షేమ గురుకుల రెజ్లింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న లక్ష్మీప్రియ సత్తాచాటి పతకం సాధించడంపై అధికారులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రియ మాట్లాడుతూ, పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఏ హఫీజ్, మహ్మద్ కరీం, కోచ్ ప్రయాంకకు కృతజ్ఞతలు తెలిపింది.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి



ఓటరు నమోదు పత్రాలు ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి

జమ్మికుంట(హుజూరాబాద్): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని లోటస్ ఫాండ్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2021 లోపు డిగ్రీ పూర్తయిన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా పని చేస్తానన్నారు. అనంతరం ఓటరు నమోదు పత్రాలను ఆవిష్కరించారు. మహమ్మద్ అంకూస్, రహమాన్, కొండ విజయ్ పట్టభద్రులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తి కాళోజీనగర్‌లో శ్రీ నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను ఆదివారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నవదుర్గ సేవా సమితి యూత్ సభ్యులు వీఎన్ ఆర్‌ను శాలువాతో సత్కరించారు.


గుండె జబ్బును గుర్తించడంలో ఈసీజీ కీలకం



ఈసీజీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనీశ్

కరీంనగర్‌టౌన్: ప్రాథమికంగా గుండె జబ్బును గుర్తించడంలో ఈసీజీ కీలక పాత్ర పోషిస్తుందని మెడికవర్ గుండె వైద్యనిపుణుడు అనీశ్ పబ్బ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని హోటల్ ప్రతిమలో ఎంబీబీఎస్ వైద్యులకు ఏర్పాటు చేసిన ఈసీజీపై శిక్షణ సదస్సులో పాల్గొని అవగాహన కల్పించారు. దశాబ్దాల కాలంగా గుండె పనితీరును ఈసీజీ ద్వారానే నిర్ధారించడం జరుగుతుందని, అధునాతన పరికరాలు అందుబాటులోకి వచ్చినా ఈసీజీకి మాత్రం ప్రాముఖ్యత తగ్గలేదన్నారు. పేషంట్ అత్యవసరంగా ఆసుపత్రికి వచ్చినప్పుడు ఆ పేషెంట్ పరిస్థితిని తెలుసుకునేందుకు అందుబాటులో ఉన్న ప్రతీ వైద్యుడికి ఈసీజీ గురించి తెలియాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. కార్డియాలజిస్టులతో పాటు అన్ని విభాగాల వైద్యులకు ఈసీజీపై అవగాహన ఉన్నప్పుడే పేషెంట్లకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, సిబ్బంది హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండలరాయుడి కోటకు అడ్డుగోడ



కొండగట్టు కొండలరాయుడి కోట



భక్తులు వెళ్లకుండా అధికారులు కట్టిన గోడ

- చరిత్ర ఆనవాళ్లకు చెదలు పట్టిస్తున్న ఆలయ అధికారులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయం పక్కనే కొండలరాయుడి కోట (గుండు) బండల సముదాయంతో ఉంటుంది. ఈ గుండును నిత్యం వచ్చే భక్తుల్లో సుమారు 50 శాతం మంది చూసి వెళ్తుంటారు. అంతేకాకుండా కోట మీదకు వెళ్లి, సెల్ఫీలు దిగుతూ ప్రకృతిని ఆస్వాదిస్తారు. ఈ నేపథ్యంలో కోట చరిత్రను భక్తులకు తెలిసేలా అభివృద్ధి చేయాల్సిన అధికారులు అడ్డుగా గోడ పెట్టి చరిత్రకు చెదలు పట్టేలా వ్యవహరిస్తున్నారు.

బల్మూరి వంశీయుల కోట

జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాల గ్రామానికి చెందిన బల్మూరి రఘుపతిరాయుడు, దమ్మాయి దంపతుల కోటగా ఈ కోటకు గుర్తింపు ఉంది. కాగా మానాలకు చెందిన రాజు ఇక్కడి నుంచే గుర్రపు స్వారీ చేసేవారని, ఇక్కడ గుర్రపు డెక్కల అచ్చులు అలాగే కొలనుకు సంబంధించిన ఆనవాళ్లు ఉన్నా యి. అంతే కాకుండా రాజు ఈ ప్రాంతం నుంచే పరిపాలన కొనసాగించేవారని చరిత్ర చెబుతోంది.

అడ్డుగా గోడ కట్టిన అధికారులు

గుట్ట మీద ఉన్న కొండలరాయుని కోట వద్దకు వెళ్లడానికి భక్తులు చాలా వరకు మొగ్గు చూపిస్తుంటారు. ఈ క్రమంలో అధికారులు కోటపైన రెయిలింగ్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, అక్కడికి వెళ్లకుండా అడ్డుగా గోడ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతమంతా అస్తవ్యస్తంగా మారి దుర్గంధభరితంగా మారినా పట్టించుకునేవారే కరువయ్యారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు.

కోటను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం

కొండరాయుడి కోటను పరిశీలించి మరమ్మతు చేయిస్తాం. భక్తులు గుట్ట పైకి వెళ్లేలా చూస్తాం. రెయిలింగ్, ఇతర అభివృద్ధి పనుల గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం.

– రామకృష్ణారావు, కొండగట్టు ఆలయ ఈవో

నక్సలైట్ సానుభూతిపరుడి చందాల దందా

- వనపర్తిలో పట్టుబడిన సుదర్శన్‌రెడ్డి



సుదర్శన్‌రెడ్డి

సిరిసిల్ల: నక్సలైట్ సానుభూతిపరుడిగా పనిచేసిన ఓ యువకుడి చందాల వసూళ్ల దందా మరోసారి వెలుగులోకి వచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి(40) తాజాగా వనపర్తి జిల్లాలో రైస్‌మిల్లర్లను నక్సలైట్ల పేరిట చందాల కోసం బెదిరించడంతో అక్కడి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపూర్ మండలం సోలిపూర్ గ్రామానికి చెందిన తేనేటి శేఖర్‌రెడ్డి అనే రైస్‌మిల్లర్‌కు సుదర్శన్‌రెడ్డి ఈ నెల 1న ఫోన్ చేసి రూ.50లక్షలు చందా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే చంపుతానని బెదిరించాడు. దీంతో శేఖర్‌రెడ్డి పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. శేఖర్‌రెడ్డితో సుదర్శన్‌రెడ్డికి ఫోన్ చేయించి పట్టుకున్నారు. సుదర్శన్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ ప్రకటించారు.

హైదరాబాద్ అడ్డాగా..

మామిడిపల్లికి చెందిన రామయ్య–కమలమ్మ దంపతుల కొడుకు సుదర్శన్‌రెడ్డికి 8 ఎకరాల భూమి ఉండగా అప్పుల పాలై నాలుగెకరాలు అమ్ముకున్నాడు. మరో 4 ఎకరాలు సోదరి మమతకు తల్లిదండ్రులు ఇచ్చారు. ఊరిలో పెద్దగా భూమి లేదు. తల్లిదండ్రులను సైతం పట్టించుకోకుండా హైదరాబాద్‌లో ఉంటూ చందాల దందాకు తెరలేపాడు. హైదరాబాద్ అడ్డాగా వసూళ్లకు పాల్పడినట్లు గతంలోనూ కేసులు నమోదయ్యాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనూ వ్యాపారులను నక్సలైట్ల పేరుతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేయగా పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో ఉంటూ మాజీ నక్సలైట్‌గా ఆత్మరక్షణ కోసం వెపన్ లైసెన్స్ పొందాడు. చార్మినార్ వద్ద జర్మనీ కంపెనీకి చెందిన 3.2 రివాల్వార్ కొనుగోలు చేశాడు. అబ్సిగూడ ప్రాంతంలోని అపార్టుమెంట్‌లో భార్యతో ఉంటూ.. రివాల్వార్‌తో బెదిరిస్తూ రియల్ ఎస్టేట్ దందాలో సెటిల్‌మెంట్లు చేసినట్లు మొత్తం 13కేసులు నమోదయ్యాయి. జిల్లాలో నక్సలైట్ల ఉద్యమాలు తిరోగవించగా, నక్సలైట్ సానుభూతిపరుడు ఇంకా చందాల దందాకు దిగడం గమనార్హం.

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి



పొలంలో నరేశ్ మృతదేహం

మానకొండూర్: విధి నిర్వహణలో భాగంగా అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి పడి మృతిచెందిన ఘటన మండలంలోని కెల్లెడలో జరిగింది. స్థానికులు, గ్రామస్తుల వివరాలు.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన జోగు నరేశ్ (35) మానకొండూర్ మండలం కొండపల్కల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మూడున్నరేళ్లుగా అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కెల్లెడ శివారులోని ఓ స్తంభంపై ఇన్సులేటర్ పాడైపోవడంతో ఆదివారం ఉదయం కొత్తది అమర్చేందుకు ఆపరేటర్ ద్వారా ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) తీసుకుని విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఈక్రమంలో స్తంభంపై ఉన్న తీగలకు విద్యుత్ సరాఫరా కావడంతో షాక్‌కు గురై స్తంభంపై నుంచి పొలంలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా ఎల్‌సీ తీసుకున్న నరేశ్ ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ తీసుకుని స్తంభం ఎక్కితే బతికేవాడని విద్యుత్ అధికారులు వాపోతున్నారు. కాగా ఎల్‌సీ తీసుకున్న తర్వాత కూడా విద్యుత్ సరఫరా కావడంపై అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



శ్రీధర్ (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిరిసిల్ల పట్టణం పెద్దూరులోని కేసీఆర్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసీఆర్‌నగర్‌కు చెందిన సిరిమల్ల రాములు– రేణుక దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ముగ్గురు కొడుకులు సంతానం. కూతుళ్లు, ఇద్దరు కొడుకులకు పెళ్లిళ్లు జరిగి వేరే ఉంటున్నారు. అందరికంటే చిన్నవాడైన సిరిమల్ల శ్రీధర్ (34) ఇంటర్ వరకు చదివి సాంచాలు నడుపుకుంటూ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈ మధ్యకాలంలో సాంచాల పని బందుకావడంతో చేతిలో డబ్బులు లేక తీవ్ర మనస్తాపం చెందాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువు కట్టపై చెట్ల నరికివేత

- జీపీ సిబ్బంది తీరుపై ఫిర్యాదు



చెట్లను నరుకుతున్న కూలీలు

వీణవంక(హుజూరాబాద్): మొక్కలు నాటాలి.. వాటిని సంరక్షించాలి.. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ నినాదం. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. మండలంలోని బేతిగల్ గ్రామ ఊర చెరువు కట్ట వెంట ఉన్న చెట్లను రెండు రోజులుగా ఓ కాంట్రాక్టర్ నరికివేస్తుండటంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం, ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా చెట్లను నరికివేశారు. ఆదివారం పది మంది కూలీలు చెట్లను నరికివేస్తుండగా ఇరిగేషన్ డీఈఈ రవీందర్‌కు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆయన తన సిబ్బందిని పంపించేలోపు ట్రాక్టర్‌లో ఉన్న కలపను అక్కడే వదిలేసి ఉడాయించారు. అప్పటికే రూ.లక్ష విలువ చేసే రెండు ట్రాక్టర్ల కలప తరలించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అనుమతి లేకుండానే..

చెట్లను నరికివేయాలని కాంట్రాక్టర్‌తో జీపీ సిబ్బంది ఒకరు మాట్లాడినట్టు తెలిసింది. రెండు రోజులుగా చెట్లు నరికివేస్తుండగా సదరు సిబ్బంది అక్కడే ఉన్నాడు. కొందరు గ్రామస్తులు అభ్యంతరం చెప్పినా పెడచెవిన పెట్టారు. ఈ తంతంగమంతా తెలియకుండా చేయడంపై అధికారులు మండిపడుతున్నట్లు తెలిసింది. సోమవారం ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరుపనున్నట్లు సమాచారం. ఈ విషయమై గ్రామ ప్రత్యేకాధికారి కరణ్‌కుమార్‌ను వివరణ కోరగా, చెరువు కట్ట వెంట చెట్లను తొలగించాలని చెప్పలేదని, తమ సిబ్బంది ఎవరైనా ప్రోత్సహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చర్యలు తీసుకుంటాం

చెరువు కట్టల వెంట ఉన్న చెట్లను ఎవ్వరు నరికినా సహించేది లేదు. బేతిగల్ చెరువు వద్ద చెట్లు నరికివేస్తున్నారనే సమాచారం రాగానే సిబ్బందిని పంపించాం. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, ఇరిగేషన్ డీఈఈ

జీవితంపై విరక్తితో ఒకరు..

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల వివరాలు.. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు చెందిన కందేశ్ ప్రవీణ్(40) ఆదివారం బస్సులో వచ్చి మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులో జాతీయ రహదారిపై క్రాసింగ్ వద్ద దిగాడు. అక్కడి నుంచి వరదకాల్వ ప్రాంతానికి వెళ్లాడు. ఆ ప్రాంతంలో కొద్దిసేపు గడిపిన ఆయన చెట్టుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబసభ్యు లకు పోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానకొండూర్: మండలంలోని కెల్లెడ గ్రామానికి చెందిన కాట వెంకటేశ్ (35) ఇటీవల గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కెల్లెడకు చెందిన వెంకటేశ్ తండ్రి మల్లయ్య నాలుగు నెలల కిత్రం చనిపోయాడు. అప్పటి నుంచి తండ్రి లేడనే బాధతో వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 4న గడ్డిమందు తాగగా, కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని బూజునూరు గ్రామ చెరువులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు.. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు బతుకమ్మ చెరువు సమీపం నుంచి వెళ్తుండగా చెరువులో మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయాడా, ఎవరైన హత్య చేసి పడేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడు చామనఛాయ రంగులో ఉన్నాడని, కుడిచేతికి స్టీల్ కడెం, బ్లూ కలర్ ఫుల్‌టీషర్ట్ ధరించి ఉన్నాడని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87126 70778 నంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

శరణు శరణు రాజన్న

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధికి ఆదివారం భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి క్యూలైన్లు, కౌంటర్లను తనిఖీ చేశారు. ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. కాగా దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రాజన్న సన్నిధిలో అమ్మవారు కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

తెగుళ్ల నివారణ.. యాజమాన్యం



ఇటీవల మల్లాపూర్ మండలంలో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



లావణ్య, మండల వ్యవసాయ అధికారి

మల్లాపూర్(కోరుట్ల): వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తే తెగుళ్ల నివారణ సులభమవుతుందని వ్యవసాయశాఖ అధికారి లావణ్య తెలిపారు. ఈనేపథ్యంలో పంటలను ఆశించిన చీడపీడల నివారణలో సత్వర చర్యలు తీసుకుని తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే మేలు చేకూరుతుందన్నారు. వరి, పత్తి, కంది తదితర పంటల్లో అనుసరించాల్సిన యాజమన్య పద్ధతులు, చీడపీడల నివారణ చర్యల గురించి వివరించారు.

వరి..

ప్రసుత్తం వరి చిరు పొట్టదశ నుంచి కంకి దశలోకి మారుతోంది. ఈ సమయంలో కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశాలున్నాయి. దీని నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లేదా క్లోరంత్రానిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్ల చొప్పున లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో వరిలో మానుపుండు/కాటుక తెగులు ఆశించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. దీని నివారణకు కార్బండిజమ్ 1 గ్రాము లేదా ప్రోపికోనజోల్ ఒక మిల్లీ లీటర్ నీటిలో కలిపి ఏడు రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. వరికి ఆకుముడుత తెగులు సోకడానికి ఇది అనుకూల సమయం. దీని నివారణకు 1.5 గ్రా. ఎఫిసెట్ లేదా 2 గ్రా. కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుంది. బ్యాక్టీరియా, ఎండాకు తెగులు కూడా వరికి ఆశించే అవకాశాలున్నాయి. నివారణకు 30 గ్రా. ప్లాంట్‌మైసిన్ మందును లీటర్ నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఉల్లికోడు ఆశించే అవకాశం ఉన్నందున పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలి.

పత్తిలో..

పత్తి పంటలో గూడు, పూత రాలడానికి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలం. నివారణకు 2 మిల్లీ లీటర్ల ప్లానోఫిక్స్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పత్తిలో ప్రధానంగా గులాబీరంగు కాయ తొలిచే పురుగు ఆశించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీనిని అరికట్టాడానికి మొదటి దశలో ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు వాడి పురుగు ఉధృతిని గమనించాలి. పురుగు ఉధృతి అధికంగా ఉంటే క్వినాల్ ఫాస్ 20 శాతం, ఏఎఫ్ 2 మిల్లీ లీటర్లు లేదా థయోడికార్బ్ 75 శాతం, డబ్ల్యూపీ 2 గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే సత్ఫలితాలుంటాయి.

కంది..

ఖరీఫ్‌లో సాగు చేసే కంది పంటకు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఆకుచుట్టు పురుగు ఆశించే ఆవకాశం ఉంది. పంటలో ఎక్కడైనా పురుగును గమనిస్తే దీని నివారణకు 2.5 ఎంఎల్ క్లోరోపైరిఫాస్ మందును లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి.

సాంకేతిక విద్యను అభివృద్ధి చేయాలి

- ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు



మాట్లాడుతున్న డాక్టర్ బీఎన్‌రావు

కరీంనగర్: ప్రపంచ దేశాలతో పోలిస్తే అత్యధికంగా ఉన్న మానవ వనరులే మన దేశ సంపద అని బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు అన్నారు. ఆదివారం ఫిలింభవన్‌లో 'ప్రస్తుత విద్యా రంగం– నిరుద్యోగ సమస్య– పరిష్కార మార్గాలు' అంశంపై ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మనదేశంలో ప్రస్తుతం విద్యావిధానం కేవలం ఉత్తీర్ణత శాతం మీదనే కేంద్రీకృతమై నడుస్తోందని, తద్వారా నైపుణ్యాలు పెరిగే అవకాశం లేదన్నారు. సంప్రదాయ విద్యకు స్వస్తి పలికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా నూతన విద్యావిధానాన్ని రూపొందించాలపి పేర్కొన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీ చేయనున్నట్లు తెలిపారు. శాసన మండలిలో నిరుద్యోగుల పక్షాన గళం విప్పుతానని, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు, జిల్లాకో స్కిల్ నాలెడ్జ్ సెంటర్, నిరుద్యోగ భృతి లక్ష్యంగా ముందుకు సాగుతానని వెల్లడించారు. సదస్సులో శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ హరికాంత్, డాక్టర్ దాసరి శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎం.తిరుపతిరెడ్డి, పీఆర్ శ్రీనివాస్, ఎస్.జావిద్, శనిగరపు రవి, బీఆర్ఎస్ నాయకుడు జమీలొద్దీన్, బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్, బండ శ్రీనివాస్, చిలుక రవీందర్, అలీమొద్దీన్, విద్యార్థి, యువజన సంఘాలు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

దాతలూ.. దయచూపండి

- క్యాన్సర్‌తో పోరాడుతున్న గల్ఫ్ బాధితుడు
- రూ.10 లక్షలు కావాలంటున్న వైద్యులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



దాతలు సాయం చేయాలని వేడుకుంటున్న కుటుంబ సభ్యులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన గల్ఫ్ బాధితుడు నలిమేటి శంకర్ క్యాన్సర్‌తో పోరాడుతున్నాడు. చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేదని, దాతలు సాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. వివరాలు.. ఉన్న ఊరిలో ఉపాధి లేక అప్పు చేసి బతుకుదెరువు కోసం శంకర్ దుబాయ్ వెళ్లాడు. అక్కడ చాలీచాలని జీతంతో కంపెనీలో పనిచేస్తూ భార్య పిల్లలను సాదుకొని మెరుగ్గా జీవిస్తామనే ఆశలపై నీళ్లు చల్లినట్టు అయ్యింది. శంకర్‌కు అనూహ్యంగా ఎడమ దవడకు గడ్డ అయ్యింది. అక్కడే వైద్యం చేయించుకున్నా ఎంతకూ తగ్గలేదు. 2023 జూన్‌లో ఇంటికి వచ్చిన తర్వాత ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా క్యాన్సర్ గడ్డగా నిర్ధారణ అయింది. శంకర్ భార్య సుశీల అంగన్‌వాడీ కార్యకర్త. ఎలాగైనా భర్తను బతికించుకోవాలని తనకు వచ్చే చిన్నపాటి జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ రూ.5 లక్షల వరకు అప్పు చేసి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయిస్తుంది. ఇంకా మెరుగైన చికిత్స అందిస్తే కోలుకునే అవకాశం ఉంటుందని, అందుకు రూ.10 లక్షల మేర ఖర్చు అవుతాయని వైద్యులు సూచించారు. శంకర్‌పై బెంగతో అతడి తల్లి ముత్తవ్వ ఇటీవలే చనిపోయింది. శంకర్‌కు అయ్యే ఖర్చులు భరించలేక అతడి కుమారుడు హరిహరణ్, కూతురు శ్రీనిధి చదువులు కూడా మధ్యలోనే ఆగిపోయాయి. 'మా నాన్నను ఎలాగైనా కాపాడండి' అంటూ పిల్లలు వేడుకుంటున్నారు. ప్రభుత్వం, దాతలు మానవత దృక్పథంతో ఆదుకోవాలని కోరుతున్నారు.

సాయం చేయాల్సిన దాతలు..

నలిమేటి శంకర్
అకౌంట్ నంబర్ 79030435804
IFSC CODE: SBIN0RRDCGB
తెలంగాణ గ్రామీణ బ్యాంకు
వీర్నపల్లి శాఖ.
ఫోన్ పే/ గూగుల్ పే
95027 30814

130 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ శివారులో సుమారు 130 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను అధికారులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆర్నకొండ శివారులోని దుబ్బపల్లి పరిధిలో లారీలో బియ్యంరేషన్ లోడ్ చేసి మహారాష్ట్రలోని సిరోంచకు తరలించేందుకు సిద్ధం చేస్తుండగా.. సమాచారం అందుకున్న అధికారులు లారీని పట్టుకుని కేసు నమోదు చేశారు. కరీంనగర్‌లోని ఆటోనగర్‌కు చెందిన మోసెస్ సిరిగిరి లారీలో బియ్యం లోడ్ చేయగా, సిరోంచకు చెందిన వీరన్, లారీ నడుపుతున్న హనుమకొండకు చెందిన పి.విజేందర్‌పై కేసు నమోదైంది. బియ్యం పట్టుకున్న వారిలో టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ ఓఎస్‌డీ ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీకాంత్, సివిల్ సప్లై ఆఫీసర్ ఉష, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ త్రీటౌన్ పరిధిలో ఓ వ్యక్తి వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని అతడిని జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు .. కరీంనగర్లోని కార్ఖానగడ్డ వ్యవసాయ మార్కెట్ వద్ద శనివారం రాత్రి త్రీటౌన్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నిజామాబాద్‌కు చెందిన ఉస్మాన్‌ఖాన్ బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని తనిఖీ చేయగా 2 కిలోలకు పైగా గంజాయి పట్టుబడింది. అతడిని అరెస్టు చేసి విచారణ చేయగా సలీంఖాన్ అనే వ్యక్తి పాత్ర కూడా ఉన్నట్లు తెలిసింది. ఉస్మాన్‌ఖాన్‌ను ఆదివారం రిమాండ్ చేసినట్లు, సలీంఖాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.